క్లుప్తంగా

విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్ తనిఖీ



ఉదయగిరి: మండలంలోని శకునాలపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌ను జిల్లా మలేరియా నివారణాధికారిణి హుస్సేనమ్మ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి రోజుకు ఎన్ని జ్వరాల కేసులు వస్తున్నాయని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సీ కాలనీలో డ్రైడే అమలు తీరును పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు. ఆమె వెంట హెల్త్‌ఎడ్యుకేటర్ కే వెంకటసుబ్బయ్య, మలేరియా సబ్‌యూనిట్ అధికారి నౌషాద్‌బాబు తదితరులు ఉన్నారు

కంప్యూటర్ బహూకరణ



సోమశిల: అనంతసాగరంలోని యూటీఎఫ్ కార్యాలయానికి విశ్రాంత హెచ్‌ఎం పాపిశెట్టి నరసింహులు రూ.21వేల విలువ చేసే కంప్యూటర్‌ను శుక్రవారం బహూకరించారు. చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సురేష్ కంప్యూటర్‌ను ప్రారంభించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి హెచ్ మోహన్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శి సాధిక్, మహిళా కార్యదర్శి రాజ్యలక్ష్మి, తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఖాజామొహిద్దీన్, యూటీఎఫ్ నాయకులు వలీ అహ్మద్, మహ్మద్‌బాషా, కృష్ణయ్య, రంతుల్లా, నాయబ్, గౌస్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా

మర్రిపాడు: కదిరినాయుడుపల్లి సమీపంలో నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై శుక్రవారం కారు అదుపు తప్పి బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలు..చెన్నై నుంచి ప్రొద్దుటూరుకు వెళ్తున్న కారు కదిరినాయుడుపల్లి వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురు ప్రయాణికులు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో బద్వేల్‌లోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు రేపు

ఉదయగిరి: పట్టణంలోని షాదీమంజిల్‌లో ఉపాధ్యాయులకు 'తరగతి గదిని ఆకర్షణీయంగా రూపొందించడం ఎలా ?' అనే అంశంపై ఆదివారం శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు జేవీవీ నాయకులు దస్తగిరి అహ్మద్, రామిరెడ్డి శుక్రవారం తెలిపారు. సర్వశిక్ష ప్రాజెక్ట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య, జేవీవీ జాతీయ నాయకుడు సుధాకర్‌రెడ్డి హాజరవుతారని చెప్పారు. ఉదయగిరి, వరికుంటపాడు, సీతారామపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రేపు ఉచిత వైద్యశిబిరం


సోమశిల: అనంతసాగరం మండలం పడమటికంభంపాడులో హెల్పింగ్ హార్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ వ్యవస్థాపకుడు కొండా వెంకటరమణారెడ్డి,108 పైలెట్ చింతకుంట నరసింహారెడ్డి శుక్రవారం తెలిపారు. నెల్లూరుకు చెందిన డీఎస్ఆర్ న్యూరోకేర్ ఆస్పత్రి వైద్యులు జ్వరాలు, ఎముకల సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు. పడమటికంభంపాడు పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సన్మానం



చేజర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టార్ కిషోర్‌కుమార్‌ను హెచ్‌ఎం హైమావతి ఉపాధ్యాయ సిబ్బందితో కలిసి శుక్రవారం సన్మానించారు.ఇటీవల చిత్రకళలలతో జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకోవడంపై అభినందనలు తెలిపారు.

నాగరాజు సేవలు అభినందనీయం



ఆత్మకూరు: బిల్‌కలెక్టర్‌గా నాగరాజు అందించిన సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. మున్సిపాలిటీలో బిల్‌కలెక్టర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన జంగం నాగరాజు దంపతులను సహచర ఉద్యోగులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. నాగరాజు శేషజీవితం సుఖంగా సాగాలని ఆకాంక్షించారు. మునీర్, పెంచలయ్య, హజరత్తయ్య పాల్గొన్నారు.

మినుము రైతు కుదేలు

- ముంచిన వర్షాలు, పొగమంచు
- తెగుళ్ల దాడితో పెరిగిన పెట్టుబడులు
- ఎకరాకు రెండు బస్తాలే దిగుబడి
- ధరలూ అంతంతమాత్రమే
- పెట్టుబడులు దక్కక అన్నదాతలు ఆవేదన



చిత్తలూరులో మినుము కోస్తున్న కూలీలు

చేజర్ల: ఆత్మకూరు డివిజన్ పరిధిలో రబీ సీజన్‌లో మినుము పంట సాగుచేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది తుఫాన్ల ప్రభావంతో ముసురు పట్టడం, పొగ మంచు దట్టంగా కురవడంతో తెగుళ్లు విజృంభించి దిగుబడులు భారీగా తగ్గిపోయాయి. ధరలు కూడా అంతంత మాత్రంగా ఉండడం..పంట నాణ్యత లేక కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

దెబ్బతీసిన వర్షాలు

ఆత్మకూరు డివిజన్ పరిధిలోని మెట్టప్రాంత రైతులు రబీ సీజన్‌లో 1727 ఎకరాల్లో మినుము సాగు చేశారు. చేజర్ల మండలంలో అత్యధికంగా 730 ఎకరాల్లో సాగు చేపట్టారు. చేజర్ల, వావిలేరు, నెర్నూరు, ఆదూరుపల్లి, చిత్తలూరు, తదితర గ్రామాల్లోని రైతులు ఎక్కువ మొత్తంలో సాగు చేశారు. తొలుత పంట ఆశాజనకంగా ఉన్నా పూత దశలో ముసురు పట్టడంతో తెగుళ్లు విజృంభించాయి. దీంతో రైతులు పురుగు మందులను అధికంగా పిచికారీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయినప్పటికీ తెగుళ్లు అదుపులోకి రాక దిగుబడులు తగ్గిపోయాయి. గతంలో ఎకరాకు ఆరు నుంచి పది బస్తాల వరకు దిగుబడులు రాగా, ఈ ఏడాది రెండు బస్తాలు కూడా రాలేదని రైతులు తెలిపారు. ఈ ఏడాది తెగుళ్ల ప్రభావంతో ఎకరా సాగుకు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పెట్టుబడులు అయ్యాయి. ప్రస్తుతం మార్కెట్లో మినుముల ధర క్వింటా రూ.6,500 నుంచి రూ.7వేల వరకు మాత్రమే పలుకుతోంది. దీంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దీనికితోడు ముసురు, పొగమంచు ప్రభావంతో పంట నాణ్యత సైతం దెబ్బతినడంతో కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదని రైతులు ఆవేదన చెందున్నారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



రంగు మారిన మినుములు

దిగుబడులు రాలేదు



రబీ సీజన్‌లో మినుము పంట సాగుచేశా. ప్రస్తుతం నూర్పిళ్లు చేపడుతున్నాం. ఈ ఏడాది వర్షాలు, పొగ మంచు ప్రభావంతో తెగుళ్లు విజృంభించి పంట దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. ఎకరాకు రెండు బస్తాలు కూడా కావడం లేదు. పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– తెల్లపాటి వెంకటకృష్ణ, రైతు, చిత్తలూరు

ప్రభుత్వం ఆదుకోవాలి



గత రబీ సీజన్‌లో మినుము పంట సాగుచేయగా అధిక దిగుబడులు వచ్చాయి. దీంతో ఈ ఏడాది కౌలుకు తీసుకుని ఎక్కువ మొత్తంలో పంట సాగు చేశాం. పంట ప్రారంభ దశలో బాగానే ఉన్నా ఆ తర్వాత వాతావరణ పరిస్థితులు బాగాలేక దిగుబడులు తగ్గిపోయాయి. దీంతో పెట్టుబడులు కూడా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

– ఎడ్లపల్లి శ్రీనివాసులు చిత్తలూరు

మర్యాదపూర్వకంగా..



కావలి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. లండన్ పర్యటన ముగించుకుని బెంగుళూరుకు చేరుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విమానాశ్రయంలో రామిరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం జగన్‌మోహన్‌రెడ్డితో పాటు బెంగుళూరులోని ఆయన నివాసానికి వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. రామిరెడ్డి వెంట కావలికి చెందిన ఈతముక్కల చంద్రశేఖర్ రెడ్డి ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

అల్లూరు: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కిషోర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామంటూ బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితుల్లో చెప్పొద్దని సూచించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ నేరగాళ్ల బారిన పడితే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

వివాదాల సుడిలో కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి

- ప్రైవేట్ వైద్యుడితో ఆపరేషన్లు
- సాధారణమేనంటున్న సూపరింటెండెంట్

కావలి: పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కొందరు వైద్యులు, సిబ్బంది విధుల్లో బాధ్యతా రాహిత్యంతో ప్రవర్తిస్తుండడంతో వివాదాలు ముసురుకుంటున్నాయి. బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కాటంగారి తిరుపతమ్మ (53) అనే మహిళ మృతి చెందింది. ఆస్పత్రి సిబ్బంది నిర్లక్ష్యంతోనే ఆమె మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తాజాగా గురువారం ముగ్గురు పేషెంట్లకు కంటి ఆపరేషన్లు చేయడానికి నెల్లూరు నుంచి వచ్చిన ఓ ప్రైవేట్ డాక్టర్ కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ వద్ద హడావుడి చేశారు. పేదల కోసం ప్రభుత్వం ఉచితంగా వైద్యం అందిస్తున్న కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోకి నెల్లూరుకు చెందిన ప్రైవేట్ వైద్యుడు కంటి ఆపరేషన్లు చేయడానికి ఎలా వచ్చారు.. ఎవరు తీసుకొచ్చారు... ఆపరేషన్ చేసినందుకు ఆయనకు డబ్బులు ఎవరు ఇవ్వాలి...తదితర ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి మాత్రం ఆస్పత్రి వర్గాలు అంగీకరించలేదు. సూపరింటెండెంట్ డాక్టర్ పద్మావతి మాత్రం ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇలాంటివన్నీ సర్వసాధారణమే అన్నట్లు వ్యాఖ్యానించారు.



ఏరియా ఆస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్ వద్ద ప్రైవేట్ వైద్యుడు

పౌర హక్కులపై అవగాహన అవసరం

దుత్తలూరు: పౌర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని నరవాడ ఎస్సీ వసతి గృహ వార్డెన్ రామ్మూర్తి అన్నారు. మండలంలోని తెడ్డుపాడులోని ఎస్సీ కాలనీలో శుక్రవారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో ఆయన మాట్లాడారు. తన వ్యక్తిత్వాన్ని కాపాడుకుంటూ సమాజంలో గౌరవంగా జీవించేందుకు ప్రతిపౌరుడికి రాజ్యాంగం కొన్ని హక్కుల ద్వారా రక్షణ కల్పించిందన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన పెంచుకుని వాటి కోసం పోరాడాలన్నారు. ఆర్‌ఐ సయ్యద్ గులాం, వీఆర్వో నవీన్, స్థానికులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఆత్మకూరురూరల్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, గిరిజనులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించి చదివించాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ సూచించారు. వాశిలి ఎస్టీకాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. పౌరహక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. ఆధార్, రేషన్ కార్డులు లేని వారికి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సర్పంచ్ చెలిక రమాహరిబాబు ,ఆర్‌ఐ కొండయ్య, ఎస్సై కాసా శ్రీనివాసరెడ్డి, ఎస్సీ బాలుర వసతిగృహ వార్డెన్ పద్మనాభరెడ్డి, ఎమ్మార్పీ బ్రహ్మయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సంగం: స్థానిక తిరుమనతిప్ప ఎస్టీ కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో డీటీ సంధ్య పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నరసయ్య, పీఆర్ ఏఈ రామయ్య, హౌసింగ్ ఏఈ గౌస్ మొహిద్దీన్, ఆర్‌ఐ సల్మా, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్: అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని ఎస్టీ గిరిజన కాలనీలో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎస్సై సైదులు పాల్గొన్నారు. గిరిజనులకు చట్టాలపై అవగాహన కల్పించారు.

మర్రిపాడు: మండలంలోని ఖాదర్‌పూర్ దళితవాడలో సర్పంచ్ అన్నవరపు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. తహశీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్, ఎంఈఓ ధనలక్ష్మి హాజరై పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అల్లంపాడు వీఆర్వో వెంకటేశు, ఖాదరపూర్ పంచాయతీ కార్యదర్శి గంట కిషోర్, అంగన్‌వాడీ టీచర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

సీతారామపురం: మండలంలోని పంద్రంగి ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు పూర్వ విద్యార్థి సింగాల వెంకటరమణయ్య విద్యా సామగ్రితో పాటు ఆట వస్తువులను వితరణ చేశారు. వాటిని ఎంఈఓ మస్తాన్‌వలి చేతుల మీదుగా విద్యార్థులకు శుక్రవారం పంపిణీ చేశారు. హెచ్‌ఎం మేరీశైలజ, స్కూల్ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

3న దివ్యాంగులకు ప్రత్యేక శిబిరం

సీతారామపురం: ఫిబ్రవరి 3న మండల పరిషత్ కార్యాలయంలో దివ్యాంగులు, వృద్ధులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించి కేంద్ర ప్రభుత్వ సంయుక్త ప్రాంతీయ కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ శుక్రవారం తెలిపారు. ట్రైసైకిళ్లు, వీల్ చైర్లు, వినికిడి యంత్రాలు, తదితర ఉపకరణాలు అవసరమైన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి వచ్చే వారు సదరం సర్టిఫికెట్, రేషన్, ఆధార్‌కార్డులు, రెండు ఫొటోలు తీసుకురావాలని సూచించారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

అల్లూరు: రబీ సాగుచేసిన రైతులు తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని కావలి ఏడీఏ నాగరాజు సూచించారు. మండలంలోని పల్లిపాళెం, పురిణి గ్రామల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. వరి పంటను పరిశీలించి ఎండాకు తెగులు, సుడిదోమ, ఆకుముడత, అగ్గి తెగులు, పచ్చపురుగు, తదితరాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను రైతులకు సూచించారు.ఆయన వెంట ఏఓ ఆర్ వెంకటేశ్వర్లు, వీఏఏలు ఉన్నారు.

మొరాయించిన సర్వర్లు

అల్లూరు: అల్లూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం కూడా రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో జాప్యం చోటు చేసుకుంది ఫిబ్రవరి 1 నుంచి మార్కెట్ విలువను 10 నుంచి 50శాతం వరకు పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు పెద్ద ఎత్తున అల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్నారు. పీడీఈ సర్వర్ మొరాయించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటు చేసుకోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

ప్రజలను మోసం చేసిన చంద్రబాబు

ఆత్మకూరు: ఎన్నికలకు ముందు హామీలివ్వడం..అధికారంలోకి అమలు చేయకుండా మోసం చేయడం చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్యని పట్టణ వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్కొన్నారు. పట్టణంలోని మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో మీడియా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయకుండా ఖజానాలో నగదు లేదని సన్నాయినొక్కులు నొక్కడం సరికాదన్నారు. హామీలు ఇచ్చే సమయంలో ఎన్ని లక్షల కోట్ల నగదు కావాలో 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. హామీలను నీరుగారుస్తూ సొంత మీడియా ద్వారా తనకు అనుకూలంగా రాయించుకోవడం బాబుకే చెల్లిందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అసమర్థ పాలనను రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఏడు నెలల పాలనలో వైఎస్సార్‌సీపీపై కక్ష సాధింపులకు పాల్పడడం, దుష్ప్రచారం సాగించడం తప్ప కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధి ఏమి లేదని ఎద్దేవా చేశారు. ఆరు నెలల వ్యవధిలోనే 1.19 లక్షల కోట్ల రూపాయల అప్పులు చేశారని, ఇదేనా సంపద సృష్టించడమంటే అని ప్రశ్నించారు. కొత్తగా ఉద్యోగాలు ఇవ్వకపోగా ఉన్న చిరుద్యోగులను తొలగించడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలల నిర్మాణాలను ప్రారంభిస్తే వాటిలో మౌలిక వసతులు కల్పించి ప్రారంభించడం చేతకాక మెడికల్ చదువుకు విద్యార్థులను దూరం చేయడం దారుణమన్నారు.



ఫీజుపోరు పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ఫీజుపోరు జయప్రదానికి పిలుపు

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు విద్యార్థులకు మద్దతుగా నెల్లూరులో ఫిబ్రవరి 5న ఫీజుపోరు పోరాటాన్ని చేపడుతున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆత్మకూరు నుంచి అత్యధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఫీజుపోరు పోస్టర్లను ఆవిష్కరించారు. ఎస్సీసెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు అంద్రా సుబ్బారెడ్డి, వెంగళరెడ్డి, కొప్పోలు వెంకటేశ్వర్లు, కల్పన, మాజీ వార్డు మెంబర్ తోడేటి మణి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు విశేష పూజలు



ఆత్మకూరులో వెండి కవచ అలంకారం

ఆత్మకూరు/సీతారామపురం: వాసవీ మాత ఆత్మార్పణ దినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు, సీతారామపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శుక్రవారం విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకరణల్లో భక్తులను అనుగ్రహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

శాస్త్రోక్తంగా జీర్ణోద్ధరణ పూజలు



దుత్తలూరు: నర్రవాడలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం విశేష పూజలు, హోమాలు నిర్వహించారు.

సీపీఎం రాష్ట్ర మహాసభల జయప్రదానికి పిలుపు

ఆత్మకూరురూరల్: నెల్లూరులో ఫిబ్రవరి 1 నుంచి జరగనున్న సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆత్మకూరు పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్ రాజు పిలుపునిచ్చారు. ఆత్మకూరులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట



సోమశిల: సోమశిల గ్రామానికి చెందిన ఓ ప్రేమజంట సోమశిల పోలీసులను శుక్రవారం ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన తుపాకుల పవన్‌కుమార్, కటారి హేమలత కొద్దిరోజులుగా ప్రేమించుకుంటున్నారు. మేజర్లు అయిన వారి వివాహానికి కుటుంబ సభ్యులు అడ్డుపడుతూ వస్తున్నారు. దీంతో ప్రేమజంట పోలీసులను ఆశ్రయించగా ఇరువురి కుటుంబ సభ్యులతో పాటు గ్రామ పెద్దలను పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం పరామనంద ఆశ్రమంలో ఇరువురికి వివాహం చేశారు.

రోడ్డు భద్రత నియమాలపై అవగాహన

మర్రిపాడు: రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఎస్సై శ్రీనివాసరావు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. అనంతరం రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం పద్మలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల్లో అక్షరాస్యత పెంపునకు ఉల్లాస్

- తొలివిడతలో పొదుపు సభ్యులకు శిక్షణ
- ఇప్పటికే వలంటీర్లకు ట్రైనింగ్ పూర్తి
- కేంద్రాలకు చేరిన పుస్తకాలు
- ఎంపీడీఓల పర్యవేక్షణ

కావలి: గ్రామీణ ప్రాంతాల్లోని నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు తలపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం అమలుకు సిద్ధమైంది. మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం నవభారత్ సాక్షరతా కింద అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఈ సొసైటీ (ఉల్లాస్) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. తొలి విడతగా పొదుపు సంఘాల్లోని నిరక్షరాస్యులైన మహిళకు అక్షరాలు నేర్పనున్నారు. జిల్లాలోని 37 మండలాల్లోని 19,178 మంది నిరక్షరాస్యులైన పొదుపు మహిళలకు అక్షరాలను నేర్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం జిల్లాలో 1,900 మంది వలంటీర్ టీచర్లను గుర్తించి శిక్షణ ఇచ్చారు. వీరు రోజుకు రెండు గంటల పాటు నిరక్షరాస్యులకు అక్షరాలు నేర్పించాల్సి ఉంటుంది. నిరక్షరాస్యులైన మహిళలకు పుస్తకాలు కూడా ఇవ్వనున్నారు. గత వారం జిల్లా కేంద్రానికి పుస్తకాలు రాగా వాటిని అన్ని మండలాలకు పంపిణీ చేశారు. వాటిని వలంటీర్లకు సైతం అందజేశారు. మండలాల్లో ఎంపీడీవోలు ఈ కేంద్రాలను సందర్శిస్తూ కార్యక్రమ పురోగతిని పరిశీలించి అక్షరాస్యతను పెంపొందించేందుకు చర్యలు తీసుకోనున్నారు. ఐదేళ్లపాటు అమల్లో ఉండే ఈ కార్యక్రమానికి సంబంధించి తొలి విడతగా జిల్లాలో మార్చి 31లోగా నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దనున్నారు. నేటి అవసరాలకు అనుగుణంగా సామాజిక, ఆర్థిక, డిజిటల్, న్యాయ అంశాలకు సంబంధించిను పాఠాలను బోధించనున్నారు. కుటుంబం, ఇరుగుపొరుగు, ఆచార వ్యవహారాలు, పరిశుభ్రత, ఆరోగ్యం, పిల్లల పెంపకం, చట్టాలు, డిజిటల్ అక్షరాస్యత తదితర అంశాలపై పాఠాలు ఉంటాయి. టాటా టెలీ సర్వీస్ ద్వారా దీని కోసం ప్రత్యేకంగా 45 యూట్యూబ్ పాఠాలను సైతం సిద్ధం చేశారు. సాయంత్రం రెండు గంటల పాటు అక్షరబడి నిర్వహిస్తారు. మొదటి విడతలో భాగంగా ప్రారంభమైన ఉల్లాస్ కార్యక్రమం మార్చి నెలాఖరులోగా పూర్తవుతుంది.



ఉల్లాస్‌పై పొదుపు మహిళలకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిరక్షరాస్యులకు ప్రయోజనం

నిరక్షరాస్యులైన మహిళలకు ఉల్లాస్ కార్యక్రమం ఎంతో ఉపయోగం. వలంటీర్లు చదవడం, రాయడం నేర్పడమే కాకుండా చట్టాలపైన అవగాహన కల్పిస్తారు. ఇప్పటికే అన్ని మండలాలకు ఉల్లాస్‌కు సంబంధించిన పుస్తకాలు చేరాయి. పూర్తి స్థాయిలో బోధనా కార్యక్రమాలను కొనసాగించాలన్న లక్ష్యంతో పది మంది నిరక్షరాస్యులకు ఒక్కో వలంటీర్‌ను కేటాయించినట్లు తెలిపారు.

– కృష్ణారావు, ఏపీఎం, కావలి,



ఉల్లాస్ కిట్‌లోని పుస్తకాలు



వలంటీర్‌కు ఉల్లాస్ కిట్ అందజేస్తున్న అధికారులు